

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 18.0



హామీలు ఇచ్చారు.. జీవోలు మరిచారు

జగన్ సర్కార్‌పై అంగన్‌వాడీల కన్నెర్ర

నాలుగు ప్రధాన డిమాండ్లు నెరవేరుస్తాం అని సమ్మెలో ప్రభుత్వ పెద్దల హామీ

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ జీవో మాత్రమే విడుదల..

ఇప్పటికీ అందని చర్చల మినిట్స్ కాపీ

అత్తిలి, ఫిబ్రవరి 8 : ప్రభుత్వ పెద్దల హామీ మేరకు సమ్మె విరమించిన అంగన్‌వాడీ సిబ్బంది రెండు వారాలు అయినా అందుకు అనుగుణంగా జీవోలు విడుదల కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. డిమాండ్లలో కీలకమైన నాలుగింటిని అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. కానీ అందులో ఒక్కదానికి సంబంధించి మాత్రమే ఇప్పటి వరకూ జీవో విడుదలైంది. మిగిలిన మూడింటికి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ఇక చర్చల్లో భాగంగా డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీకి సంబంధించి మినిట్స్ కాపీని అసోసియేషన్ నాయకులకు ఇవ్వలేదు. దీంతో అంగన్‌వాడీ సిబ్బందిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. అంగన్‌వాడీ సిబ్బందికి రిటైర్‌మెంటు బెనిఫిట్స్ లక్షా 20 వేలు ఇచ్చేందుకు చర్చల్లో ప్రభుత్వ పెద్దలు అంగీకరించారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని, అర్హులందరికి సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. జూలై నుంచి వేతనాలు పెంచుతామని స్పష్టం చేశారు. వీటిలో రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌కి సంబంధించిన జీవో మాత్రమే విడుదల చేశారు. మిగిలిన మూడు అంశాలకు సంబంధించిన జీవోలు విడుదల చేయలేదు. రెండు రోజుల్లో జీవోలు అమలు చేస్తామని చర్చల సందర్భంగా ప్రభుత్వ పెద్దలు హామీ ఇచ్చారు. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. సమ్మె ప్రారంభం నుంచి చర్చల వరకూ పది డిమాండ్లను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. చర్చల్లో జరిగిన ఒప్పందానికి సంబంధించిన మినిట్స్ కాపీని యూనియన్ నాయకులకు అందిస్తామని ప్రభుత్వ ప్రతినిధులు చెప్పారు. ఇప్పటి వరకూ మినిట్స్ కాపీని అందించలేదు.

తొందరపాటు నిర్ణయమా ?

సమ్మె విరమించిన తర్వాత ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో సానుకూల స్పందన రాకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బందిలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సమ్మె విరమణ తొందరపాటు నిర్ణయమని, ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గడం వల్లే జీవోలు విడుదల, మినిట్స్ కాపీ అందించడంలో తాత్సారం చేస్తోందని పలువురు సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ఒక్కసారి సమ్మె విరమించిన తరువాత చేసేదేమీ ఉండదనే ఉద్దేశంతోనే ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎన్నికల ముందే జీవోలు వచ్చేలా అసోసియేషన్ నాయకులు ప్రయత్నించాలని కోరుతున్నారు.

ఆశాలపై ఉక్కుపాదం



బస్సుల్లో తనిఖీలు.. పోలీసుల అరెస్టులు



నరసాపురం పోలీస్ స్టేషన్‌లో ఆశ వర్కర్లు

చలో విజయవాడకు అడ్డగింత

ఎక్కడికక్కడ అరెస్ట్‌లు.. స్టేషన్‌లలో నిర్బంధం

భీమవరం/భీమవరం క్రైం, ఫిబ్రవరి 8 : 'జగన్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత యాప్‌ల పేరుతో నిత్యం గొడ్డు చాకిరీ చేయిస్తున్నారు. కేవలం పది వేలు వేతనమిచ్చి, రకరకాల పనులు చేయాలని వేధిస్తున్నారు' అంటూ ఆశా కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారంపై గురువారం 'ఛలో విజయవాడ' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. దీనిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. వందల మందిని అదుపులోకి తీసుకుంది. విజయవాడ వెళ్లేందుకు అనుమతి లేదని.. వెళితే చర్యలు తప్పవని రెండు రోజులుగా నోటీసులు జారీ చేశారు. బుధ, గురువారాల్లో భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం తదితర పోలీస్‌స్టేషన్లకు అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలను తీసుకెళ్లారు. రాత్రంతా చలి, దోమల్లోనే గడిపారు. పోలీస్‌స్టేషన్‌లోని కార్యకర్తలను విడుదల చేయాలంటూ సీపీఎం, సీఐటీయూ, తెలుగుదేశం నాయకులు ఆందోళనకు దిగారు. 60 మందికిపైగా అసోసియేషన్ ముఖ్య నాయకులను విజయవాడ వెళ్ళకుండా నిలువరించారు. తప్పించుకుని వెళ్లిన జిల్లా అధ్యక్షురాలు ఎస్.లారెన్స్‌కుమారి తదితరులను విజయవాడలో అరెస్టు చేసి గుంటూరు స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు చేసినా ఉద్యమం ఆపేది లేదని, ప్రభుత్వం తమను ప్రభుత్వ కార్యకర్తలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. 'కనీస వేతనాలు, సెలవులు లేవు. సమయపాలన లేకుండా తీవ్రమైన పనిభారాన్ని తమపై నెట్టారని భీమవరంలో గురువారం నినాదాలు చేశారు. శాంతియుతంగా వెళ్తున్న వారిని విచక్షణరహితంగా అరెస్టులు చేయియడం సిగ్గు చేటన్నారు. డి.కళ్యాణి, దీపిక, విజయలక్ష్మి, వివిధ మండలాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

- **నరసాపురం రూరల్** : ఛలో విజయవాడ వెళ్లేందుకు నరసాపురం రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆశ వర్కర్లను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రూరల్ సర్కిల్ కార్యాలయానికి తీసుకొచ్చారు. విజయవాడ వెళ్ళబోమని, తమను ఇంటికి పంపించాలని ఆశ వర్కర్లు వేడుకున్నప్పటికి పోలీసులు వినలేదు. దీనిపై టీడీపీ నాయకులు పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు, సీఐటీయూ నాయకులు తదితరులు స్టేషన్ వద్దకు వెళ్లి బైఠాయించి ఆందోళన చేయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. చివరకు పోలీసులు వారిని విడిచిపెట్టారు. మౌలాలీ, వాతాడి ఉమా, వాసు, శ్రీనివాస్, మౌలాలీ, రవి, కాశీ తదితరులు పాల్గొన్నారు.

బైఠాయించిన ఆశాలు, టీడీపీ, సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆందోళన

- **కాళ్ల** : విజయవాడ వెళుతున్న కాళ్ల మండలానికి చెందిన ఎనిమిది మంది, పాలకోడేరు మండలానికి చెందిన ఐదుగురు ఆశ కార్యకర్తలను కాళ్ళ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్‌లో నిర్బంధించారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గొర్ల రామకృష్ణ, మండా సూరిబాబు తదితరులు స్టేషన్‌కు వెళ్లి వారిని పరామర్శించి విడుదల చేయించారు. అరెస్టులను ఖండించి వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు పాడి కట్టే రోజు దగ్గర పడిందని మండిపడ్డారు.
- **ఆకివీడు** : విజయవాడలో జరిగే మహాధర్నాకు వెళ్ళడానికి అనుమతులు లేవంటూ మండలంలోని ఆశాలకు పోలీసులు బుధవారం రాత్రి నోటీసులిచ్చారు.
- **గణపవరం** : విజయవాడకు వెళ్తున్న 29 మంది ఆశా వర్కర్లను పోలీసులు పిప్పర కల్యాణ మండపంలో నిర్బంధించారు. ఆశా వర్కర్ల సమస్యలను జగన్ సర్కార్ పరిష్కరించకుండా ఉక్కు పాదం మోపడంపై సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ మండిపడ్డారు.
- **పాలకొల్లు రూరల్** : విజయవాడ వెళ్లేందుకు పాలకొల్లు రైల్వే స్టేషన్‌కు వచ్చిన పాలకొల్లు, పోడూరు, ఆచంట, యలమంచిలి మండలాలకు చెందిన 53 మంది ఆశా వర్కర్లను, సీఐటీయూ నేతలు జవ్వాది శ్రీనివాస్, దేవ సుధాకర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకుని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు స్టేషన్‌కు వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఆశాలను సాయంత్రం విడిచిపెట్టారు.



పోడూరు : పోలీసులు అరెస్టు చేసిన ఆశా వర్కర్లు

- **పెంటపాడు** : ఆశా వర్కర్ల గృహ నిర్బంధాలను ఖండిస్తూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, సీపీఎం మండల కార్యదర్శి చిర్లా పుల్లారెడ్డి తదితరులు గురువారం పెంటపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు.
- **తణుకు** : ఆశాలు సమస్యలు పరిష్కరించాలని ఛలో విజయవాడ వెళ్ళడం నేరమా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆశాల అరెస్ట్‌పై తణుకు టౌన్, రూరల్ పోలీసు స్టేషన్ల వద్ద, నరేంద్ర సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు.

హక్కుల సాధనకు పోరాటం

ప్రభుత్వం ఆశా కార్యకర్తల డిమాండ్లను అమలు చేయాలి. వీటిని సాధించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం. జిల్లాలో 1,438 మంది ఆశాలు ఉన్నారు. వారికి భద్రత కల్పించాలి. ఎందరిని అరెస్టు చేసినా మా హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తాం.

- జిల్లా అధ్యక్షురాలు లారెన్స్‌కుమారి

పెరిగిన పని ఒత్తిడి.. పెరగని జీతం

జగన్ సర్కార్ వచ్చిన తర్వాత ఆశా వర్కర్లపై పని ఒత్తిడి పెరిగింది. అదే సమయంలో వేతనాల్లో ఏ విధమైన మార్పు లేదు. ఇస్తున్న పది వేల వేతనం, నెలకు రెండు, మూడు వేలు డ్యూటీలోనే ఖర్చుగా వెళ్లిపోతుంది. కొన్నేళ్లుగా వేతనాలు పెంచలేదు. వీరితో ప్రతీ రోజు రిజిస్టర్‌లో సంతకాలు చేయించాలని, సచివాలయం, హెల్త్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటూ ఫీల్డ్‌లోకి వెళ్లి గణాంకాల సేకరణ చేపట్టాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎన్‌హెచ్ నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం పనిభారం పెంచి వత్తిడి తెస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే కార్యకర్తలకు మొబైల్ నెట్‌వర్క్ శిక్షణ అంతంతమాత్రమే. అధికారికంగా నాలుగు యాప్స్, అనధికారికంగా మరో పది యాప్‌లలో వీరితోనే సమాచారాన్ని నమోదు చేయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ పని చేయకపోయినా, సర్వర్ మొండికేసినా వీరిదే బాధ్యత. ఇలా సాంకేతిక ఇబ్బందులతో తీవ్ర మానసిక వత్తిడికి గురవుతున్నారు. దీనిపై వీరు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇటీవల 26 రకాల రికార్డులను వారితో రాయిస్తుండడంతో పనిని భారం అమాంతం పెరిగింది. ఆందోళనలో భాగంగా తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు.

- కనీస వేతనం చెల్లించాలి.
- కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ని ఆశాలుగా మార్చాలి.
- ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నటీ లీవులు ఇవ్వాలి.
- రూ.10 లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం.
- మరణించిన వారికి మట్టి ఖర్చులు.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు.
- 62 ఏళ్లకు రిటైర్‌మెంట్ వర్తింపు.
- ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు.
- ఏఎన్‌ఎం శిక్షణ. ఖాళీ పోస్టులు భర్తీ.
- కొవిడ్‌తో మరణించిన ఆశాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా.
- మరణించిన, రిటైరైన కుటుంబాల్లో అర్హులైన వారిని ఆశాలుగా తీసుకోవాలి.



తణుకు పోలీసు స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు



పెంటపాడు పోలీసు స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు



కాళ్ల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ, ఆశా కార్యకర్తలు

జగనన్న దగా.. డీఎస్సీ

ఇది ఎన్నికల స్టంట్ : సీఎంపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్

అధికారమిస్తే తొలి సంతకం డీఎస్సీకే..

డబ్బులు తీసుకున్నా.. ఓటు మాత్రం మంచి పార్టీకే వేయండి.. పోతునూరు సభలో పిలుపు

ఏలూరు/దెందులూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):'వైఎస్సార్ బతికుంటే పోలవరం పూర్తయ్యేది. 20 లక్షల ఎకరాలకు నీళ్లం దేవి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వైఎస్సార్ పుణ్యమాని వేలాది మంది ఇంజనీర్లు, డాక్టర్లుగా ఉద్యోగాలు చేసుకుంటుంటే, ఇవాళ 19 లక్షల మంది ఉద్యోగాల్లేక రూ.5-10 వేలకు అందిన పని చేసుకుంటున్నారు. 35 వేల డీఎస్సీ ఖాళీలుంటే, ఆరు వేలతో దగా డీఎస్సీ విడుదల చేస్తారా ? ఇది ఎన్నికల స్టంట్ కాక మరేంటి? కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నా తొలి సంతకం డీఎస్సీపైనే పెడతాను' అని అన్నారు. దెందులూరు నియోజకవర్గం పోతునూరులో గురువారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. '2019 ఎన్నికలకు ముందు అప్పటి సీఎం చంద్రబాబు డీఎస్సీ ప్రకటించారు. 25 వేల ఖాళీలుంటే ఇదేం డీఎస్సీ ? అంటూ ఇదే జగనన్న ఎద్దేవా చేశారు. మరి ఇప్పుడు ఏమయ్యాయి ఆ 25 వేల పోస్టులు ? 35 వేల ఖాళీలు కళ్ల ముందుంటే, కేవలం ఆరు వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం, ఒక మెగా డీఎస్సీగా చెప్పుకుంటోంది. అది మెగా కాదు, దగా డీఎస్సీ కేవలం ఎన్నికల స్టంట్ కింద మాత్రమే వైసీపీ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. నేను హామీ ఇస్తున్నా, నాతో సహా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ అనుబంధ శక్తులతో కలిసి ఈ వైసీపీ ఎమ్మెల్యేల, మంత్రుల ఇళ్ల ముట్టడిస్తాం. వైఎస్సార్ బిడ్డగా నేను ఒక్కటే చెబుతున్నా, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నా తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌కే పెడతాను. రాహుల్‌గాంధీ ప్రధాని అయిన తర్వాత ఆయన తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే చేయించుకుంటాం. వైఎస్సార్ పోయాక ఒక్కరూ కూడా సరిగా పనిచేయలేదు. రైతు చనిపోతే ఈ రాష్ట్రంలో బీమా కల్పించే దిక్కు లేదు. ఆయనే బతికుంటే పోలవరం ద్వారా 20 లక్షల ఎకరాలకు నీరందించేవారు. ఇదేనా రాజన్న రాజ్యం? ఇదేనా ఆయన ఆశయాలు సాధించే మార్గం? కేవలం వైఎస్సార్ ఆశయాల సాధనకే నేను బాధ్యతతో నా పుట్టింటి వంటి ఏపీకి వచ్చాను. ఈ రాష్ట్రానికి హోదా వచ్చే వరకు నేను కదలను, రాజధాని పూర్తయ్యేవరకు వెళ్లను. పోలవరం పూర్తయ్యేవరకు విడిచి పెట్టను' అని అన్నారు.



పోతునూరు సభలో మాట్లాడుతున్న షర్మిల...



ఇది ఎన్నికల సమయం

'అమ్మా! ఇది ఎన్నికల సమయం. ఐదేళ్లకు ఒకసారి వచ్చే సమయం. ఓట్ల కోసం అందరు నాయకులూ వస్తారు, డబ్బులు ఇస్తారు. ఎవరెవరు ఎంతెంత ఇచ్చినా తీసుకోండి పర్లేదు. శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా నాయకులు ఏమిచ్చినా వద్దనకండి. కానీ, ఓటు మాత్రం మీ ఆలోచన అయి ఉండాలి. మంచి పార్టీకే ఓటు వేయండి. మీకు ఎవరైతే మంచి చేశారో వాళ్లకే మద్దతివ్వండి. టీడీపీని చూశారు, వైసీపీకి ఒక్క ఛాన్స్ ఇచ్చి మోసపోయారు' అంటూ పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లి హోదా అడిగానని కబుర్లు చెప్పే జగన్‌ను దీటుగా ప్రశ్నించగల సత్తా ఒక్క షర్మిలకే ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ అన్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌కు కొత్త కళ వచ్చిందని, ఈ రోజు మహిళలందరూ మన పార్టీ వైపే చూస్తున్నారన్నారు. మన గ్రామానికి రావాలని అడిగిన వెంటనే అనారోగ్యంతో ఉన్నా సరే, పట్టించుకోకుండా పోతునూరు వచ్చారని నియోజకవర్గ నాయకుడు డీవీఆర్కే చౌదరి తెలిపారు. జెట్టి గుర్నాథరావు తదితరులు మాట్లాడారు.

ఆలస్యంగా రాక

కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుగా నిర్ణయించుకున్న సమయం కంటే షర్మిల రాక ఆలస్యమవడంతో షెడ్యూల్‌లో నిర్ణయించుకున్న బస్సు యాత్రను బహిరంగ సభతో ముగించారు. షర్మిల అనారోగ్యం కారణంగా గుంటూరు జిల్లా నుంచి ఆమె రాక ఆలస్యం కావడంతో షెడ్యూల్లో పలు మార్పులు జరిగాయి. సాయంత్రం ఐదు గంటలకు సత్యనారాయణపురం చేరుకోవాల్సి ఉండగా, ఆరు గంటల సమయంలో అక్కడకు చేరుకున్నారు. దీంతో యాత్రను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న నాయకులు, నేరుగా ఆమెను సభ ఏర్పాటు చేసిన పోతునూరులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె వచ్చిన పది నిమిషాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆమెను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు మహిళలు పోటీ పడ్డారు.

పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు

ఇళ్ల స్థలాలేవి ?

- గొరగనమూడిలో 298 మంది లబ్ధిదారులు లబోదిబో.. ఆందోళనకు సిద్ధం
- ఇప్పటికీ సొమ్ములు ఇవ్వని ప్రభుత్వం.. పొలాన్ని ఇచ్చేందుకు రైతుల నిరాకరణ
- పట్టించుకోని అధికారులు



ఇళ్ల స్థలాలకు కేటాయించింది ఈ పొలమే

పాలకోడేరు, ఫిబ్రవరి 8 : పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చిన అధికారులు.. స్థలాలు ఇవ్వడం మర్చిపోయారు. దీనిపై 298 మంది లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గొరగనమూడి జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల నిమిత్తం అధికారులు లంక పొలాల్లోని నాలుగు ఎకరాల 92 సెంట్లు భూమి డి - ఫారం పట్టా భూమిని సేకరించారు. ఎకరానికి రూ.48 లక్షలు చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు రైతులను ఒప్పించారు. ఆ తర్వాత పెన్నాడకు చెందిన 102 మంది, గొరగనమూడిలో 89 మంది, విస్సాకోడేరుకు చెందిన ముగ్గురికి వెరసి మొత్తం 298 మంది లబ్ధిదారులకు ఈ భూమిని ఇళ్ల స్థలాలుగా ఇచ్చేందుకు నిర్ణయించి పట్టాలు ఇచ్చారు. ఇళ్ల స్థలాలు పెన్నాడకు ఐదు కిలోమీటర్లు, గొరగనమూడికి నాలుగు, విస్సాకోడేరుకు ఐదు కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికి ఇంటి స్థలం వస్తే అదే చాలని వారంతా భావించారు. కాని, పట్టాలిచ్చి నాలుగేళ్లయినా వారికి స్థలాలను అప్పగించలేదు. దీనిపై అధికారుల చుట్టూ వారు ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ఎందుకు ఇవ్వలేదని ఆరా తీస్తే.. ఆ పొలం రైతులకు చెల్లించాల్సిన డబ్బును ఇవ్వలేదని తేలింది. సొమ్ములిస్తే తప్ప భూములను ఇచ్చేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికలు సమీపించడంతో స్థలాలు దక్కుతాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు.



గొరగనమూడిలో సమావేశమైన లబ్ధిదారులు

లబ్ధిదారులకు న్యాయం చేయాలి

జగనన్న కాలనీ లబ్ధిదారులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పొన్నమండ బాలకృష్ణ అన్నారు. లబ్ధిదారులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇళ్ళ స్థలాలు కేటాయించే వరకు దీక్ష చేపట్టి పోరాడతానన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. గోడి రమేష్, తులసే చంద్రమోహన్, ప్రసాద్, మట్టా శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.



వంటలు సిద్ధం చేస్తున్న భక్తులు, సిబ్బంది

నేడు మావుళ్లమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన



ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8 :మావుళ్ళమ్మ అఖండ అన్నసమారాధన శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించేందుకు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పూర్తిచేసింది. అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయం అన్ని వైపులా మార్గాలను మూసివేశారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి లోపలికి వచ్చేలా ఏర్పాటు చేశారు. డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద వంటలు వండే కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది నిమగ్నమయ్యారు.

ద్వారకాతిరుమల ఆలయ డిప్యూటీ ఈవోగా బాబూరావు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8: చినవెంకన్న ఆలయంలో డిప్యూటీ ఈవోగా బాబూరావు గురు వారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ ఎంఎస్ఎన్ ఛారి టీస్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

మావుళ్ళమ్మ ఈవోకు డీసీగా పదోన్నతి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8 : మావుళ్ళమ్మ దేవస్థానం సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి భద్రాజీకి డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి వచ్చింది. అనంతపురం జిల్లా కస్వపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి డీసీగా నియమించారు. గురువారం అక్కడ బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లారు. మావుళ్ళమ్మ దేవస్థానం సహాయ కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. కొంతమంది ఈవోలకు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి వచ్చే అవకాశం ఉందని అందులో ఒకరిని ఇక్కడ నియమించే అవకాశం ఉందని చెబుతున్నారు.

దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకం

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 8 : దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకమని, విభిన్న రంగాలలో నూతన ఆవిష్కరణల రూపకల్పనకు అవి ఎంతగానో దోహదపడతాయని పాట్నాలోని ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జగన్నాథ్ మాలిక్ అన్నారు. ఏపీ నిట్ ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఈసీఈ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఛాలెంజెస్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ యాంటినాస్ ఫర్ వైర్‌లెస్ కనెక్టవిటీ అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వైర్‌లెస్ కనెక్టవిటీ కోసం జరుగుతున్న విస్తృత పరిశోధనలు, వాటి ప్రాధాన్యం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కన్వీనర్‌గా డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.యువరాజులు వ్యవహరించారు. ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ పీ.శంకర్, డాక్టర్ సుభాని, డాక్టర్ వి.సుదర్శనదీప తదితరులు పాల్గొన్నారు.

16 వరకూ కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 : ఎపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ న్యాయవాదులు తలపెట్టిన ఉద్యమంలో భాగంగా ఈనెల 16 వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ఏలూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఎపీ ల్యాండ్ టైటిలింగ్ వల్ల సన్న, చిన్న రైతులకు, బడుగు, బలహీన వర్గాల రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని భూములపై పూర్తి అధికారాలు రెవెన్యూ శాఖకే అప్పగించడం వల్ల భూములు భూస్వాముల చేతిలోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇప్పటికే న్యాయవాదులు ఈ యాక్టును నిరసిస్తూ ఏలూరు కోర్టు బయట రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. మరోవైపు హైకోర్టులో కూడా ఏలూరు బార్ అసోసియేషన్ తరఫున ఈ చట్టంపై పిల్ దాఖలు చేశారు. ఈనెల 16 వరకూ కోర్టు విధులను బహిష్కరించాలని ఏలూరు బార్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.

పెద్దాసుపత్రికి అడ్డంకులు

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్

నాలుగేళ్లుగా కదలికలేని భూసేకరణ



తణుకు, ఫిబ్రవరి 8: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన భూ సేకరణ కలగానే మిగిలింది. జిల్లా కేంద్ర ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తు 2020లోనే అప్పటి వైద్య ఆరోగ్యశాఖా మంత్రి ఆళ్ల నాని శంకుస్థాపన చేశారు. పూర్తిస్థాయి వైద్య సేవలు అందు బాటులోకి వస్తాయని అంతా భావించారు. అయితే నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ భూసేకరణ విషయంలో కదలిక లేదు. ఉమ్మడి జిల్లాలోనే తణుకు ఆసుపత్రికి మంచి పేరుంది. జాతీయ రహదారికి దగ్గర్లో ఉండటం ఉభయగోదావరి జిల్లాలకు అనువుగా ఉండటం వంటి కారణాలతో పొరుగు జిల్లాల వాసులు కూడా ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. టీడీపీ హయాంలోనే అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవ తీసుకుని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తు ఉత్తర్వులను తీసుకువచ్చారు. తర్వాత వైసీసీ అధికారంలోకి వచ్చింది. తర్వాత కూడా జిల్లా కేంద్రం భీమవరం, తాడేపల్లి గూడెం, వంటి పట్టణాలు తెరమీదకు వచ్చినప్పటికీ చివరకు తణుకులోనే ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉన్న కేశవస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు చెందిన పది ఎకరాల భూమిని లీజుకు తీసుకునే విధంగా నవంబరు 2020 సంవత్సరంలో అభివృద్ధి కమిటీ తీర్మానం చేసి పంపించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ ఫైలు వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిసింది. ఈ భూమి జాతీయ రహదారికి దగ్గరగా ఉండటం వల్ల పేదలకు వైద్య సదుపాయాలకు, రవాణాకు అనువుగా ఉంటుందని భావించి ఎంపిక చేశారు.

ఉత్సవ విగ్రహాలపై మలినాలు !



యలమంచిలి, ఫిబ్రవరి 8: దొడ్డిపట్ల గ్రామంలోని కేశవస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలపై అగంతకులు గురువారం రాత్రి దుర్గంధంతో కూడిన పదార్థాన్ని వేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు గురువారం సాయంత్రం ఆలయం ద్వారానికి ఉన్న ఇనుప గ్రిల్‌కు ఉన్న తలుపుల వద్ద నుంచి ఆలయం లోపలికి దుర్గంధంతో కూడిన పదార్థాన్ని విసిరివేసి ఉంటారని భావిస్తున్నారు. ఆ పదార్థం ఉత్సవ విగ్రహాలపైన, స్వామివారి పాదుకలపైన పడి ఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. గ్రామస్తులు ఆలయ ఈవోకి తెలియజేయడంతో పాటూ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఇదే గ్రామంలోని మట్టపర్తివారిపాలెం ప్రాంతంలోని రామాలయంలో వారం రోజుల క్రితం ఇదే విధంగా జరిగిందని పలువురు స్థానికులు చెబుతున్నారు.



మాతవగూడెం వద్ద కోతకు గురైన నెక్లెస్ బండ్

నెక్లెస్ బండ్ రక్షణ గాలికి..

తాత్కాలిక పనులతో కాలక్షేపం

ఇప్పటివరకు రూ.14 కోట్లు వెచ్చించి పనులు

నిధుల వినియోగంపై స్థానికుల్లో అనుమానాలు

పోలవరం, ఫిబ్రవరి 8 : పోలవరం గ్రామానికి గోదావరి వరదల నుంచి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్‌కి పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టలేదు. పోలవరం గ్రామంలో గోదావరి నది తీరంలో సుమారు 150 ఎకరాల మేర ఇసుక తిన్నెలు కొట్టుకుపోయి లంక గట్లు పూర్తిస్థాయిలో కోతకు గురయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మించిన స్పిల్‌వే నుంచి విడుద లవుతున్న గోదావరి వరద జలాలు నేరుగా పురుషోత్తపట్నం రేవుని తాకి అదే వేగంతో పోలవరం ఏటిగట్లను, నెక్లెస్ బండ్‌ను తాకుతూ ప్రవహిస్తూ ఉండడం వల్ల నెక్లెస్‌బండ్ కోసం వేసిన నల్లబంకమన్ను అండలుగా విరిగిపడి కోతకు గురైంది. ఐదేళ్ళ క్రితం వచ్చిన వరదలకు గట్లు ప్రమాద స్థాయిలో కోతకు గురవడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పోలవరం ప్రాజెక్టు నుంచి రాళ్లు తెచ్చి పాతపోలవరం బోటు పాయింట్ ప్రాంతం నుంచి ఆంజనేయస్వామి ఆలయం ర్యాంపు వరకూ తాత్కాలిక రక్షణ చర్యలు చేశారు. తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారే గానీ శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టలేదు.మూడున్నర కిలోమీటర్ల మేర నెక్లెస్ బండ్‌కి రక్షణ చర్యలు చేయవలసి ఉండగా ఒకటిన్నర కిలోమీటర్ల మేర మాత్రమే పనులు చేసి నిలిపివేశారు. ఇప్పటి వరకూ నెక్లెస్ బండ్ నిర్మాణం కోసం విడతల వారీగా సుమారు రూ.14 కోట్లు ఖర్చు చేశారు.

నాలుగేళ్లుగా అరకొర పనులు



ఆంజనేయస్వామి గుడి రేవులో ఆగిన పనులు చూపుతున్న టీడీపీ నాయకుడు

నెక్లెస్ బండ్ నిర్మాణం కోసం తొలుత కోటి యాభై లక్షల రూపాయలతో లంక భూములను కొనుగోలు చేశారు. మూడు కోట్లతో పోలవరం ప్రాజెక్టు నుంచి తరలించిన నల్లబంక మన్నుతో నెక్లెస్ బండ్ నిర్మించారు. రాళ్ళతో రివిట్‌మెంట్ పనులు చేయవలసి ఉండగా గాలికొదిలేశారు. తర్వాత వరుసగా నాలుగేళ్లలో వచ్చిన వరదలకు గట్లు కొట్టుకు పోతుండడంతో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ బండ్‌కి ప్రాజెక్టు నుంచి తరలించిన రాళ్లతో ఏపీ టూరిజం బోట్ పాయింట్ నుంచి సీడబ్ల్యుసీ కార్యాలయం వరకూ రూ.3 కోట్లతో కొంతమేర గట్టు వేసి వదిలేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఆంజనేయస్వామి ఆలయం వరకూ గట్టు కోతకు గురవడంతో మళ్ళీ అక్కడి వరకూ రాళ్లతో గట్టు వేశారు. వేసిన గట్టు పూర్తిగా కాకుండా 10 అడుగుల దిగువ వరకూ వేసి వదిలేశారు. ఇలా విడతల వారీగా నెక్లెస్ బండ్ నిర్మాణానికి 14 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయితే నిధుల వినియోగంపై విచారణ జరపాలని స్థానిక టీడీపీ నాయకులు మంగిన కొండ, యడ్ల వినోద్, ఆకుల రాజా, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పోశీరత్నం, పార్వతి, పట్నాల దేవి, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వరదలు వస్తే ప్రమాదమే



నెక్లెస్ బండ్‌కి రక్షణ చర్యలు చేయకపోతే రానున్న వరదలకు కోతకు గురై గ్రామానికి వరదల నుంచి ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. అధికారులు వరదల సమయాల్లో తూతూ మంత్రంగా ఇసుక బస్తాలు, తడికలు, కర్రలతో తాత్కాలిక చర్యలు చేపడతున్నారే శాశ్వత చర్యలపై దృష్టి పెట్టడం లేదు.

-మంగిన కొండ, టీడీపీ నాయకుడు

గోదాట్లో కోట్లు



నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద కోతకు గురైన గోదావరి ఏటిగట్టు

మళ్లీ కుంగిన ఏటిగట్టు

నరసాపురం వాసుల్లో భయాందోళన

అర్ధరాత్రి ఇళ్ల నుంచి బయటకు..

రూ.28 కోట్లతో చేపట్టిన పనులకు తూట్లు

నరసాపురం, ఫిబ్రవరి 8: గోదావరి ఏటిగట్టు పనుల్లో మళ్లీ డొల్లతనం బయటపడింది. రూ.28 కోట్లతో నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద చేపడుతున్న గట్టు గురువారం తెల్లవారుజామున కుంగిపోయింది. రాళ్లు నీళ్ళల్లోకి జారుగుతున్న సమయంలో పెద్దగా శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకొచ్చారు. మంచు, చీకటి కారణంగా కొద్దిసేపు ఏం జరిగిందో తెలియని పరిస్థితి. అయితే జారుతున్నది రాళ్లు అని తెలుసుకుని ఒక్కసారిగా ఆందోళన చెందారు. తెల్లవారుజాము వరకు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఉదయాన్నే పోలీసులు వచ్చి గట్టు మీదకు ఎవరినీ అనుమతించలేదు.

2022 జూలై నెలలో వచ్చిన వరదకు అమరేశ్వరస్వామి గుడి నుంచి బుడితల రేవు వరకు సుమారు 400 మీటర్ల మేర గోదావరి గట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50 లక్షలు వెచ్చించి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. 2022 నవంబర్‌లో రూ.28 కోట్లతో కోతకు గురైన గట్టు పటిష్ఠపనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పనులు చేపట్టారు. సుమారు 100 మీటర్ల మేర రాళ్లతో గట్టును పటిష్ఠపర్చారు. ఈ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటూ మాజీ ఎమ్మెల్యే బందారు మాధవనాయుడు ఆరోపిస్తూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం తిరస్కరించిన క్వారీ నుంచి రాళ్లు తీసుకొచ్చి పనులు చేపడుతున్నారని దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్, నరసాపురం సబ్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించ లేదు. గత నెలలో ఒక్కసారిగా గట్టు కుంగిపోయింది. అప్పటి నుంచి కోతకు గురైన గట్టును పటిష్ఠం చేస్తూ వచ్చారు. అయితే ఈనెల రోజులు చేసిన పనంతా వృధా అయింది. మళ్లీ గతంలో ఎక్కడైతే కోతకు గురైందో అక్కడ వేసిన రాళ్లన్నీ నీటిపాలయ్యాయి.



విచారణ జరిపించాలి : టీడీపీ

కోతకు గురైన గట్టును టీడీపీ ఇన్‌ఛార్జ్ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడులు పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పనులపై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రేపు వరదల సమయంలో ఇలాంటి పరిస్థితి తలెత్తితే వచ్చే ప్రమాదానికి ఎవరు బాధ్యులు వహిస్తారంటూ ప్రశ్నించారు. జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, బర్రె మురళీ, శశిదేవి, నాగలక్ష్మి, మల్లాడి మూర్తి తదితులు పాల్గొన్నారు

రబీ గుబులు



కోడేరు బ్యాంక్ కెనాల్‌లో అడుగంటిన నీట మట్టం

ఇంకా పూర్తికాని వరి నారుమళ్లు

వెంటాడుతున్న వంతులవారీ కష్టాలు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 8: రబీ వరిసాగులో జాప్యం కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో వరి నారుమళ్లు పూర్తికాలేదు. రబీ ఆలస్యమైతే సాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయోమోనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. సార్వా ధాన్యం కొనుగోళ్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈ నెల 15 నాటికి ధాన్యం కొనుగోళ్ళను పూర్తిచేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. రబీకి పెట్టుబడులకు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి రబీ విస్తీర్ణం తగ్గే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో రబీకి సంబంధించి 4,936 ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 3,746 ఎకరాల్లో మాత్రమే వరి నారుమళ్లు వేశారని చెబుతున్నారు. జిల్లాలో 98 వేల 726 ఎకరాల్లో రబీ వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ నిర్ధేశించుకుంది. దీనికి సంబంధించి ఇప్పటివరకు 71,355 ఎకరాల్లో వరి నాట్లు వేశారని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

మొక్కజొన్నదీ అదే పరిస్థితి

మెట్టలో మొక్కజొన్న ప్రధాన పంటగా సాగు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో 1,04,261 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 57,764 (55 శాతం) ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. అపరాల సాగు విస్తీర్ణం 42,486 ఎకరాలు కాగా ఇప్పటివరకు 40,064 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది.నూనెపంటల సాగులో సాధారణ విస్తీర్ణం 3029 ఎకరాలు కాగా 3,388 ఎకరాల్లో, వాణిజ్య పంటలు జిల్లాలో 32,074 ఎకరాలు కాగా 23,768 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. మొత్తం మీద రబీలో అన్ని పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 2,80,673 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,96,432 ఎకరాల్లో సాగు ఆరంభం అయింది.

ఆచంటలో ఇంజన్లతో నీరు

ఆచంట, ఫిబ్రవరి 8: రబీకి వంతుల వారీ విధానంలో సాగునీరు అందిస్తున్నారు. దీంతో ఆచంట మండలంలో శివారు ప్రాంతాల్లో సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని రోజులుగా కోడేరు బ్యాంక్ కెనాల్‌లో నీటి మట్టం పూర్తిగా తగ్గింది. దీంతో కొంతమంది రైతులు ఇంజన్ల సాయంతో తమ పొలాలకు నీటిని అందిస్తున్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 : రైలు నుంచి ఒక యువ కుడు జారిపడి మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన చెల్లే ఆశిష్ కుమార్ (27) విజయవాడలో ఉన్న తన మేనమామ ఇంటికి వెళ్ళే నిమిత్తం కాకినాడ పోర్టు నుంచి విజయవాడ వెళ్తున్న (రైల్ నెంబర్ 17258) రైలును గురువారం ఎక్కాడు. రద్దీ ఎక్కువగా ఉండడంతో భోగీ గుమ్మంలో నిలబడిన అతను ఏలూరు సమీపంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్సులో తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కామవరపుకోట, ఫిబ్రవరి 8 : కామవరపుకోట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూడు రోజుల నుంచి ఒక వ్యక్తి భిక్షాటన చేస్తూ అపస్మారక స్థితిలో బస్టాండ్ ఆవరణలోనే పడి ఉన్నాడని తడికలపూడి ఎస్ఐ జయబాబు గురువారం తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108లో జంగారెడ్డిగూడెం తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే ఎస్ఐ సెల్ నెంబర్ 9440796678 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 8 : కట్నం కోసం వేధిస్తున్నారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని చినరంగనిపాలెంకు చెందిన గుత్తుల ప్రమీలకు 2017లో దుర్గాప్రసాద్‌తో వివాహమైంది. పెళ్ళి సమయంలో రూ.1.20 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఇటీవల అదనపు కట్నం తేవాలంటూ దుర్గాప్రసాద్ అతని కుటుంబ సభ్యులు వేధించడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ రామ్‌కుమార్

తూర్పుపాలెంలో చోరీ

రూ.75 వేల నగదు, ఉంగరం చోరీ

పోడూరు, ఫిబ్రవరి, 8 మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి వేమవరపు నాగమణి ఇంట్లో చోరీ జరిగింది. తూర్పుపాలెం ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయం దగ్గరలో ఆమె ఇద్దరు కుమారులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటుంది. పెద్దకుమారుడు అనారోగ్యం కారణంగా బంధువుల ఇంటివద్ద ఉండగా రెండో కుమారుడు ఆమె వద్దే ఉంటున్నాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి దగ్గరగా ఉండటంతో పది రోజులుగా నిర్వహిస్తున్న 'మనసారా ఆసరా' సంబరాలకు వంటపనులు నిమిత్తం రోజువారీ కూలీగా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వంట పనులు చేసి ఇంటికి వెళ్లగా ఇంటిలో వస్తువులన్నీ చిందరవందరగా, బీరువా తాళాలు పగటుకొట్టి ఉండటంతో చోరీ జరిగిందని నాగమణి గుర్తించింది. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి చెప్పి బోరుమంది. బీరువాలో ఉన్న రూ.75 వేలు నగదు, అరకాసు బంగారు ఉంగరం చోరీకి గురైనట్లు నాగమణి తెలిపింది. చోరీకి గురైన ప్రాంతాన్ని ఎస్ఐ రామ్ కుమార్ పరిశీలించారు. వేలిముద్రల నిపుణులతో పరిశీలించారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం..రాగివైరు చోరీ




పెదవేగి, ఫిబ్రవరి 8 : పొలాల్లో వ్యవ సాయ మోటార్ల దగ్గర విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరును దుండగులు చోరీ చేసు న్నారు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగికి చెందిన ఉండవల్లి రాము, పరసా సీతామహాలక్ష్మి, పొట్నూరి దుర్గాదేవి అనే రైతులకు చెందిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులో ఉండే రాగివైరును తీసుకెళ్ళి పోయారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు రూ.15 వేలు విలువైన రాగి వైరు ఉంటుందని, మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రూ.45 వేలు విలువైన రాగి వైరు చోరీకి గురైందని ఎస్ఐ చెప్పారు. పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం ఏఈ నాగేషుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేశామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఇరువర్గాల కొట్లాట..ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

ఆకివీడు, ఫిబ్రవరి 8: పాత తగాదాల నేపథ్యంలో ఇరు వర్గాల కొట్లాటలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసులు నమోదు చేశారు. కోళ్ళపర్రు గ్రామంలో రొయ్యల చెరువు దగ్గర నడక దారి విషయంలో పాసం నర్సింహమూర్తి, పాసం విష్ణుమూర్తిలు గొడవ పడ్డారు. శుక్రవారం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



వీరవాసరం, ఫిబ్రవరి 8: చింతలకోటిగరువు పరిధిలోని నడపనవారిపాలెం గ్రామానికి చెందిన పిండి వెంకటకృష్ణ కనిపించడం లేదని అందినఫిర్యాదుపై కేసు నమోదు చేశామని వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి కనిపించడం లేదని అతని మేనమామ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఏకారణం లేకుండానే ఇంటి నుంచి వెళ్లాడని తిరిగి రాలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీపీ సీడ్స్ డీఎం అనుమానాస్పద మృతి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 8: నూజివీడు మండలం మీర్జాపురం గ్రామ పరిధిలోని సీపీ సీడ్స్ కంపెనీలో డీఎంగా పనిచేస్తున్న థాయ్‌లాండ్ వర్సిట్ జంకియో(45) అను మానాస్పద స్థితిలో మృతిచెందాడు. గురువారం సీడ్స్ కంపెనీలో మీటింగ్ సమయంలో బయటకు వచ్చిన ఆయన కార్యాలయపు పైభాగంలోని సెకండ్ ఫ్లోర్ పైభాగంలో గల వాష్ రూమ్‌లో ఉన్న ఓపెన్ ఏరియాకు వెళ్లి అక్కడి నుంచి కిందికి పడిపోవడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడిది థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌గా కంపెనీ వర్గాలు తెలిపాయి. నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిం చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ తెలిపారు.

లాకర్‌లో బంగారం మాయంపై విచారణ

తణుకు, ఫిబ్రవరి 8: దువ్వ ప్రాథమిక సహకారం పరిపతి సంఘంలో లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు మాయం అవడంపై అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం దువ్వ సొసైటీలోని లాకర్‌లో భద్ర పర్చుకున్న యన్నమని ఉమామహేశ్వరికి చెందిన 806 గ్రాముల బంగారు ఆభరణాలు మాయం అవ్వడం తెలిసిందే. 2018 సంవత్సరంలో లాకర్‌లో బంగారు నగలు భద్రపర్చుకొన్నారు. ఆరు సంవత్సరాలు తర్వాత ఈనెల 6న లాకర్ తెరచి చూడగా లాకర్‌లో వస్తువులు కనిపించకపోవడంతో ఉమాదేవి సొసైటీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, ఎస్ఐ చంద్ర శేఖర్‌లు సొసైటీలో విచారణ చేపట్టారు. భీమవరం జిల్లా కోఆపరేటివ్ అధికారి ఆదేశాలు మేరకు తణుకు డీసీవో వెంకటేశ్వరరావు సొసైటీలో రికార్డులను పరిశీలించారు. బాధితురాలు సమక్షంలో అధికారులు పలు రికార్డులును తనిఖీ చేశారు. ఉమాదేవి గతంలో రికార్డుల్లో ఉన్న సంతకాలు, లావాదేవీలు సరిచూసి సంతకాలను సరిపోల్చుకున్నారు.

21 మంది వీఆర్వోలకు పదోన్నతులు



కారుణ్య నియామకపత్రం అందిస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న 21 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు అందజేశారు. ఏలూరు జిల్లా ఆకివీడు మండలానికి చెందిన కడిమి కిరణ్‌కు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కారుణ్య నియా మకం ద్వారా అటెండర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వీఆర్‌వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు, రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీరామ చంద్రమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈవో



భీమవరం రూరల్, ఫిబ్రవరి 8 : ఇప్పటి వరకు పశ్చిమ గోదావరి జిల్లాకు ఇన్‌చార్జి జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఆర్.వెంకటరమణకు రెగ్యులర్ విద్యాశాఖ అధికారిగా పదోన్నతి కల్పిస్తూ పశ్చిమ గోదావరి జిల్లాకు నియమించడం జరిగింది. గురువారం నాడు జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యా లయంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరింత కష్టపడి పనిచేసి విద్యాశాఖలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. జరగబోవు పదవ తరగతి పరీక్ష ఫలితాలు మన పశ్చిమ గోదావరి జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

నరసాపురం, ఫిబ్రవరి 8: స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో పాలకొల్లు రవాణశాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని పాలకొల్లు ఆర్టీవో వెంకటేశ్వర్లు ప్రారంభించారు. డ్రైవర్లకు పరీక్షలు చేసి పాలకొల్లు లయన్స్ ఆస్పత్రి కళ్లజోళ్లు అందించారు.

జెయింట్ వీల్ ఏర్పాటుకు వేలంపాట

ఆచంట, ఫిబ్రవరి 8: ఆచంట శ్రీ రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని ఆచంటలో మొదటి సారి జెయింట్ వీల్ నిర్వహణకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించగా రూ.19 లక్షల 25 వేల రూపాయల ఆదాయం వచ్చింది. దేవస్థానానికి సంబంధించి ఆలయ సత్రం పక్క ఉన్న ఖాళీ స్థలంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పది రోజులు పాటు జెయింట్ వీల్ వంటివి ఏర్పాటు చేసే నిమిత్తం గురువారం స్థానిక ఆలయం వద్ద దేవస్థానం అధికారులు సమక్షంలో టెండర్ కమ్‌బహిరంగ వేలం పాట నిర్వహించారు. కొత్తపేటకు చెందిన బొక్కా సత్యనారాయణ వేలంపాటలో దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు ఆర్‌వీఎస్ రాము, గుబ్బల రామ పెద్దింట్లరావు తెలిపారు.

ప్రతిభా విద్యార్థులకు మెడల్స్ అందజేత

ఆచంట, ఫిబ్రవరి 8: కొడమంచిలి హైస్కూల్‌లో 2023 సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో స్కూల్‌లో ప్రథమ స్థానం సాధించిన ప్రియాంకకు గోల్డ్ మెడల్, ద్వితీయ స్థానం పొందిన సుహాసినికి సిల్వర్ మెడల్‌ను గ్రామానికి చెందిన కొల్లేపర వెంకన్నబాబు తన మనుమడు తనూస్ నాగ వెంకట్ చేతులు మీదుగా అందజేశారు.

ముగిసిన ఆసరా ఉత్సవాలు



డ్వాక్రా మహిళలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే చెరుకువాడ

ఆచంట, ఫిబ్రవరి 8: తూర్పుపాలెంలోని ఎమ్మెల్యే శ్రీరంగనాథ రాజు క్యాంప్ కార్యాలయం వద్ద పది రోజుల పాటు నిర్వహించిన ఆసరా సమావేశాలు గురువారంతో ముగిశాయి. పది రోజులు పాటు ఈ సమావేశాలకు సుమారు 80 వేల మంది పాల్గొన్నట్లు ఎమ్మెల్యే రంగనాథరాజు తెలిపారు. వచ్చిన మహిళలందరికి ఆత్మీయ విందు ఏర్పాటు చేసి చీర, సారె అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆదినారాయణ మృతి తీరని లోటు

మొగల్తూరు, ఫిబ్రవరి 8: మొగల్తూరు పంచాయతీ పాలకవర్గ సభ్యుడు సీపీఎం సీనియర్ నాయకుడు జడ్డు ఆదినారాయణ మృతి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్ అన్నారు. ఆదినారాయణ ఇటీవల మృతి చెందడంతో పడమటిపాలెంలో ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా సీపీఎం చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొని పార్టీకి అండగా ఉండేవారన్నారు. ఈసభకు మండల సీపీఎం కార్యదర్శి యడ్ల చిట్టిబాబు అధ్యక్షత వహించారు.

మురుగుబోదె తవ్వి పంటలు కాపాడాలి



పూడుకుపోయిన మురుగు బోదెను చూపుతున్న రైతు

మొగల్తూరు, ఫిబ్రవరి 8: రామన్నపాలెం అడవిపర్రలో మురుగుబోదె తూడుతో పూడుకుపోవడంతో చేలల్లో మురుగునీరు లాగక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడవిపర్రలోని జంగిల్ చానల్‌కు ఎడమవైపు గల 70 ఎకరాల వరిసాగులోని మురుగు నీరు లాగకపోవడంతో చేలన్ని మునిగిపోతున్నాయి. దీంతో నాలుగు సంవత్సరాలుగా సార్వా సాగు చేయడం లేదు. కనీసం దాళ్వా సాగు చేయాలని రైతులు సమాయత్తం అయినా మురుగునీరు లాగక రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. ఆయకట్టు రైతులు యాతం పాండురంగారావు, చంటి, మేకల పరశురామ్, అరేటి రాజా, పులపర్తి సత్తికొండలు విలేకరులతో మాట్లాడుతూ జంగిల్ చానల్‌కు ఎడమవైపు గల ఈమురుగు బోదెను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేర్చి పూడిక తొలగించి రైతులకు సహకరించాలని కోరారు.

నేడు మంచినీటి సరఫరా బంద్

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8 : పైప్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలో వన్‌టౌన్‌లోని కొన్ని ప్రాంతాలకు, టూటౌన్‌లోని మొత్తం వార్డులకు శుక్రవారం సాయంత్రం మంచినీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

కాళ్ళ, ఫిబ్రవరి 8 : పెదఅమిరంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు పంపిణీ చేశారు. నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు రూ.2లక్షల 60వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.

16లోగా దరఖాస్తులు చేయాలి

ఆకివీడు, ఫ్రిబవరి 8:ఆకివీడులో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహం నిర్వహించడానికి అర్హత, అనుభవం కలిగిన స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి సుజాతరాణి తెలిపారు. మూడేళ్ళ ఆర్థిక నివేదికలతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలను మూడు సెట్స్ రూపంలో ఈ నెల 16లోగా దరఖాస్తులను కలెక్టరేట్‌లోని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారి కార్యాలయంలో అందచేయాలన్నారు.



కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8: మహాత్ముడి ఆశయాలు నెరవేర్చడం మనందరి బాధ్యత అని పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోడి వెంకట్రావు అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి అవగాహన, ర్యాలీ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక, సెయింట్ మేరీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అయన మాట్లాడుతూ సెయింట్ మేరీస్ లేప్రసి సెంటర్ కుష్ఠు వ్యాధిగ్రస్తులకు చేస్తున్న సేవలు అద్వితీయమని అన్నారు. విద్యార్థుల్లో ఇటువంటి వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం గొప్ప విశేషమని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించారు. అంటరాని తనాన్ని నిర్మూలిద్దాం.. మహాత్ముని ఆశయాలను నిలబెడదాం అంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్ జే చాన్ బాషా, పి.రాజబాబు, గోపీనాథ్, శర్మ పాల్గొన్నారు.






పెనుమంట్ర మండలంలో మాజీ మంత్రి పితాని సమక్షంలో టీడీపీలో చేరిక.. మొయ్యేరులో మాట్లాడుతున్న ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు.. తణుకులో ఆరిమిల్లి రాధాకృష్ణ సమక్షంలో టీడీపీలో చేరికలు.. భీమవరంలో ప్రచారం చేస్తున్న టీడీపీ-జనసేన నాయకులు

‘జగన్ పాలనలో కక్ష సాధింపులకే ప్రాధాన్యం’

తణుకు/ఇరగవరం, ఫిబ్రవరి 8 : జగన్ పాలనలో అందరికి ఇబ్బందులే అని మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకులోని ఆయన నివాసంలో ఇరగవరం గ్రామం నుంచి మండల అధ్యక్షుడు గోపిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో పలువురు వైసీపీకి చెందిన బీసీ యువకులు టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌కు ఒక్క చాన్స్ అని భావించి గెలిపించిన వారికి అన్నీ ఇబ్బందులు, అభివృద్ధిపట్ల నిర్లక్ష్య ధోరణి, కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. టీడీపీ నాయకులు డాక్టర్ దొమ్మేటి వెంకటసుధాకర్, కడియాల సూర్యనారాయణ, జుత్తిగ సత్యనారాయణ, గుబ్బల శ్రీనివాసు, మెరిపే రాజేష్, పెచ్చెట్టి వేణు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

గణపవరం, ఫిబ్రవరి 8: టీడీపీ, జనసేన పార్టీ ఉమ్మడి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు అన్నారు. మొయ్యేరులో కార్యకర్తల విస్తృత సమావేశం గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగింది. గన్ని మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలంతా సమష్టిగా కృషి చేసి టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వ ఏర్పాటుకు పాటుపడాలన్నారు. మొయ్యేరు పార్టీ అధ్యక్షుడు కానుమిల్లి చంటి, మాజీ ఎంపీపీ భీమవరపు లక్ష్మి, జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, గణపవరం పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్‌రాజు, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు కాపారం చిన్న, మాజీ సర్పంచ్ చంద్రమోహనరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రంగనాథరాజు వ్యాఖ్యలు హాస్యాస్పదం

పెనుమంట్ర, ఫిబ్రవరి 8: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే డ్వాక్రా మహిళలకు అన్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే రంగనాథరాజు చెప్పటం హాస్య స్పదంగా ఉందని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమరాజు ఇల్లెందులపర్రు, మల్లిపూడి గ్రామాల్లో పితాని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని సైకిల్ గుర్తుకు ఓటేసి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. నవరత్నాల పేరట ప్రజలను మోసం చేసిన దగాకోరు ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో ఆచంట నియోజవర్గ జనసేన సమన్వయకర్త చేగొండి సూర్య ప్రకాష్, తెలుగుదేశం మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, గూడూరు మురళి జనసేన మండల అధ్యక్షుడు కోయ వెంకట్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిమెట్ల సుందర రామ రెడ్డి ఇంటి వద్ద వైసీపీ నుంచి టీడీపీలోకి కర్రీ భైరవ రెడ్డి, చిక్కా ప్రసాద్ తదితరులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ సమక్షంలో చేరారు.

అప్పుల ఊబిలో రాష్ట్రం

నరసాపురం, ఫిబ్రవరి 8: అభివృద్ధిని పక్కన పెట్టి సంచులు పట్టుకుని అప్పుల కోసం వెతుకులాడుతున్నారంటూ టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో బడ్జెట్‌పై మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అంకెల గారడీతో బడ్జెట్ లెక్కలు కట్టి ప్రజల్ని మోసం చేసిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. ప్రజలపై అప్పులు మిగిల్చిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, ఆధికార అనంత రామారావు, కొల్లు పెద్దిరాజు, అందే రామకృష్ణ, మల్లాడి మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రాన్ని గంజాయికి అడ్డాగా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విమర్శించారు. గురువారం పట్టణంలోని 19వ వార్డులో ‘భవిష్యత్ గ్యారెంటీ’ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ విధానాలతో అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారని వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమన్నారు. ఈ సందర్భంగా బాబ్జిని టీడీపీ నాయకులు సత్కరించారు. టీడీపీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, వాడపల్లి సుబ్బరాజు, మురళి పాల్గొన్నారు.

భీమవరం: జనసేన-తెలుగుదేశం పార్టీ కూటముతోనే అభివృద్ధి సాధ్యమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ అన్నారు. తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజుతో కలిసి గురువారం నాడు జనంతో జనసేన కార్యక్రమం 38వ వార్డులో నిర్వహించారు. గొర్ల గోపి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ సెక్రటరీ సుంకర రవి, మాగపు ప్రసాద్, రామాయణం శ్రీనివాస్, ఎద్దు ఏసు పాదం, ఆకుల శ్రీను పాల్గొన్నారు.





మోగల్లులో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ అధికారులు.. యలమంచిలి మండలం పాలకమ్మ చెరువులో ఎలుకల బొరియలు పరిశీలిస్తున్న అధికారులు, రైతులు.. పెనుగొండ మండలంలో ఎలుకల నివారణ మందు పంపిణీ

సామూహికంగా ఎలుకలు నివారిద్దాం

పాలకోడేరు, ఫిబ్రవరి 8 : ఎలుకలను నివారించుకోవడం ద్వారానే అధిక ఉత్పత్తులు సాధించుకోవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మోగల్లు గ్రామంలో పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి జె. వెంకటేశ్వరరావు పరిశీలించి ఎలుకలను నియంత్రిచుకోవడం ఎలా అన్న అంశంపై రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహికంగా ఎలుకలను నిరించేందుకు ఉచితంగా బ్రోమోడియోలిన్ అనే మందును అందజేస్తున్నామన్నారు. భీమవరం సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి పి.నారాయణరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సూర్యకృష్ణ, లావణ్య పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: రుస్తుంబాదాలో ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి ఎలుకల నిర్మూలన ఏవిధంగా చేపట్టాలన్నదానిపై అవగాహన కల్పించారు. పంట పొలాల్లో ముందుగా ఎలుకల కన్నాలను గుర్తించాలన్నారు. ఆ తరువాత తెరుచుకున్న కన్నాల్లో ఎలుకల నిర్మూలన మందును పెట్టాలన్నారు. ఇదే రైతులందరూ ఒకే సారి కన్నాల్లో మందు పెట్టడం వల్ల సామూహికంగా ఎలుకల్ని నిర్మూలించుకోవచ్చున్నారు. ఏవో డాక్టర్ రాజశేఖర్, రైతులు యడ్లపల్లి ఆర్జునుడు, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు

పెనుగొండ: రైతులు తీసుకున్న విషపు ఎరను పది గ్రాములు చొప్పున చిన్న చిన్న పొట్లాలుగా కట్టుకుని తెరచి ఉన్న ఎలుకల కన్నాల వద్ద ఉంచాలని మండల వ్యవసాయాధికారి పి. స్పందన తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన నిర్వహిస్తున్నారు. నడిపూడి, వడలి గ్రామాల్లో బ్రోమోడయోలిన్ కలిపిన మందును రైతులకు పంపిణీ చేశారు.

మొగల్తూరు: మొగల్తూరులోని పాలకమ్మ చెరువు, ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ పర్యటించి పొలం గట్ల వద్ద ఉన్న ఎలుకల బొరియలను పరిశీలించి మట్టితో మూసివేయించారు. ఎలుక కన్నాలను గుర్తించి తాము అందించే మందు పొట్లాలను వాటిలో ఉంచాలన్నారు. ఎలుకల నిర్మూలన చేసినట్టయితే మంచి దిగుబడి సాదించవచ్చన్నారు.

గణపవరం: గ్రామాల్లో ఎలుకల బొరియల గుర్తింపు కార్యక్రమం నిర్వహిం చినట్టు ఏవో ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎర పొట్లాలు పెడతారన్నారు. రైతులకు అవగాహన కల్పించామని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉచితంగా ఎరను పంపిణీ చేస్తామని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెంటపాడు: పొలాలకు హాని కల్గించే ఎలుకల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏడీఏ మురళికృష్ణ, ఏవో పార్థసారథి సూచించారు. జట్లపాలెం, మౌంజిపాడు, కె.పెంటపాడు తదితర గ్రామాలలో పర్యటించారు. ఎలుక కన్నాలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చి వేయించారు. కట్టుబోయిన కృష్ణప్రసాద్, వీఏఏలు పాల్గొన్నారు.

ఆకివీడు: మండలంలో రైతులకు శుక్రవారం ఉచితంగా ఎలుకల మందు పంపిణీ చేస్తున్నట్టు వ్యవసాయాధికారి ప్రియంక తెలిపారు. బ్రోమోడయోలిన్, నూనె, నూకలు కలిపి రైతులకు అందజేస్తామని తెలిపారు.




నరసాపురంలో పోలీసు స్టేషన్ ఎదుట బైఠాయించిన టీడీపీ నాయకులు రామరాజు, కొవ్వలి.. తాడేపల్లిగూడెంలో ఆశాలకు వలవల బాబ్జి మద్దతు

ఆశాల అరెస్ట్ దారుణం

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 8 : ఆశావర్కర్‌లు తమ న్యాయమైన కోర్కెల పరిష్కారం కోసం తలపెట్టిన పోరాటాన్ని పోలీసులతో అడ్డుకునేందుకు అరెస్టు చేయడం దారుణమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఆశా వర్కర్‌లను గురువారం పోలీసులు అరెస్టు చేయడంతో వారికి ఆయన మద్దతుగా నిలిచారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగులకు సేవలందించిన ఆశాలపై ప్రభుత్వ మొండివైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, దాసరి అప్పన్న, ఎ.సతీశ్, ఎం.పరశురాం, తదితరులు ఉన్నారు. నరసాపురంలో ఆశా వర్కర్ల అరెస్టుకు నిరసనగా పోలీసు స్టేషన్ ఎదుట టీడీపీ నాయకులు బైఠాయించారు.

ఓటుహక్కు.. విలువపై అవగాహన

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8: యువకులుగా ప్రతి విద్యార్థి ఓటు హక్కును వినియోగించుకోవాలని బ్రౌనింగ్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో ఓటు హక్కు, విలువ ఆవశ్యకతపై ర్యాలీ, ప్రతిజ్ఞ, అవగాహన నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్లు తొలగించే ప్రయత్నం

ఆకివీడు, ఫిబ్రవరి 8: లాంచీలరేవు దగ్గర నగర పంచాయతీ, డ్రైనేజీ స్థలాల్లో ఆక్రమణలుగా భావిస్తూ షెడ్లు తొలగించడానికి గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ స్థలం తమదేనంటూ శ్రీభక్తాంజనేయ చేపల కమిషన్ వర్తక సంఘం అధ్యక్షుడు షేక్ సుభాని, తదితరులు తేల్చి చెప్పారు. సర్వే చేయించి నిజ నిజాలు తేల్చాలన్నారు. దీనితో అధికారులు వెనతిరిగారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి



పూర్ణాహుతి పూజలు చేస్తున్న దత్త విజయానందతీర్థ స్వామీజీ.. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శివ

ఆకివీడు, ఫిబ్రవరి 8: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగిన రోజున దైవం మనకు అండగా ఉంటుందని దత్త విజయానందతీర్థ స్వామీజీ అన్నారు. గురువారం దత్త క్షేత్రంలో ఆయన దత్తుడు, పంచముఖ ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేసి పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు సందేశమిచ్చారు. తల్లిదండ్రులకు సేవలుచేసే వారికి సకల ఐశ్వర్యాలు కలుగుతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే శివ ఆధ్యాత్మికంగా చాలా సేవలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దత్త ట్రస్టీ కృష్ణమూర్తి, భక్తులు ఉన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ఆకివీడు, ఫిబ్రవరి 8: మహిళల అభ్యున్నతే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరావు, నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. గురువారం అయి-భీమవరం రోడ్‌లోని వి కన్వెన్షన్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆసరా నాల్గోవిడతలో భాగంగా డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ జామి హైమావతి, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, మెప్మా చైర్మన్ మోరా జ్యోతి రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రసూల్‌బీబీ, పుప్పాల పండు, శిరపు శ్రీను పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన నాయకులు

ఉండి, ఫిబ్రవరి 8: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ని విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఉండి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు తెలిపారు. గురువారం పత్రికలకు వివరాలను తెలిపారు. నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు మండలాలలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లినట్లు తెలిపారు. నాగరాజుతో పాటు మండల కన్వీనర్లు యడవల్లి వెంకటేశ్వరరావు, అల్లాడ బాలాజీ, ఎరుబండి రామాంజనేయులు, గాదం తాతాజీ, ఆకివీడు టౌన్ అధ్యక్షుడు బాబులు తదితరులు పవన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఆచంట: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఆచంట జనసేన ఇన్‌చార్జి చేగొండి సూర్య ప్రకాష్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనసేన ఆచంట వైస్ ఎంపీపీ యర్రగొవ్వుల నాగరాజును పవన్ కల్యాణ్‌కు పరిచయం చేశారు.

11 నుంచి కవిటంలో అతిరుద్ర మహాయాగం

పోడూరు, ఫిబ్రవరి 8: కవిటంలో ఈనెల 11వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శ్రీఉమా రామలింగేశ్వరరావు, శర్వాణీ స్కూల్ ఆధ్వర్యంలో అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు నిర్వహిస్తారు. 11న గోమాత సహిత మంగళ వాయిద్య పూర్ణకుంభ వేద పఠనంతో దాతలచే గ్రామ ప్రదక్షిణ, గణపతి పూజతో మహాయాగ మహోత్సవాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. 12న కాణిపాకం శ్రీ సిద్ధి బుద్ధి సమేత వర సిద్ధి వినాయక స్వామి దివ్య లీలా కల్యాణం, 24వ తేదీ వరకూ ప్రతీ రోజు అయా స్వామి వార్లకు కళ్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



భీమవరం టౌన్, ఫిబ్రవరి 7 : పట్టణంలోని 14వ వార్డు శ్రీఅభయసాయి ధ్యాన మందిరం (మినిషిర్డి) 31వ వార్షికోత్సవం ఘనంగా ప్రారంభమైంది. 8న సాయినాథుని హోమం, 9న రుద్రాభిషేకం, చామంతి పుష్పాలతో పూజ, లలితా సహస్ర నామం, హనుమాన్ చాలీసా పారాయణం, 10న ఓమ్ సాయి శ్రీసాయి జయజయ సాయి అర్థ ఏకాహమ్, 11న బాబావారికి 22 ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం, అన్నదానం చేస్తామని శ్రీషిర్డిసాయి సత్సంగ సేవాశ్రమమ్ ట్రస్టీ నిమ్మల శారద సాయి, కోశాధికారి అడబాల సాయి శివకుమార్ తెలిపారు.

పుంత రహదారుల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సంపత్‌కుమార్

పెంటపాడు, ఫిబ్రవరి 8 : మండలంలో పుంత రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, రూ.5.2 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తాడేపల్లిగూడెం ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన నిర్వహించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ కట్టుబోయిన కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జట్లపాలెం ఎంపీయూపీ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించ డంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తాం

తణుకు, ఫిబ్రవరి 8 : రానున్న రోజుల్లో విద్యార్థుల సమస్యలు, హక్కుల సాధన కోసం పోరాటం చేస్తామని ఇంటర్మీడియెట్ కళాశాలల ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం ఎస్ఎన్‌వీటీ కాలేజిలో ఎస్ఎఫ్ఐ తణుకు పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ కన్వీనర్‌గా ఎ.నాని, కో-కన్వీనర్‌గా ఎం.దివ్యతో పాటు పదిమంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 14,15వ తేదీలలో విజ్ఞాన్ వికాస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

తణుకు, ఫిబ్రవరి 8 : విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలని మానవత సేవాసంస్థ స్టేట్ కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి అన్నారు. గురువారం ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. మానవత జిల్లా శాంతి ర్యాలీ అధ్యక్షుడు గమిని రాంబాబు పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మానవత నాయకులు కటారి శారదాదేవి, కాశీవిశ్వనాదం, ఆలపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

ఎరువుల లెక్కల్లో తేడా వస్తే చర్యలు తప్పవు



మోదుగుంటలో ఎరువుల గోదాము పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 8: ఎరువుల లెక్కల్లో తేడాలు కనిపిస్తే చర్యలు తప్పవని తణుకు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎంవీ రమేష్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెం మండలంలోని కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి, మోదుగగుంట, నవాబు పాలెం, ఆరుగొలను గ్రామాల్లో ఎరువుల గోదాములు తనిఖీ చేసి స్టాకును పరిశీ లించారు. కృష్ణాయపాలెం, పెదతాడేపల్లి గ్రామాల్లోని షాపుల్లో సరైన పత్రాలు లేక అమ్మకాలు నిలుపుదల చేశారు. ఆ షాపుల్లో రూ.3లక్షల 92 వేల విలువ గల స్టాక్‌ను సీజ్ చేశారు. షాపు లైసెన్స్‌ల్లో రెన్యువల్ చేసుకుంటే అమ్మకాలకు అనుమతినిస్తామని అధికారులు తెలిపారు. ఎరువుల స్టాకు వివరాలు, ధరలు రైతులకు తెలిసేలా బోర్డు పెట్టాని సూచించారు. ఏవో ప్రసాద్, మాధవవర్మ పాల్గొన్నారు.

టీడీపీ నేత దామోదర్ మృతికి సంతాపం

అత్తిలి, ఫిబ్రవరి 8 : బొంతువారిపాలెం గ్రామం టీడీపీ సీనియర్ నేత శీలబోయిన దామోదర్ మృతి పట్ల తణుకు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జి విడివాడ రామచంద్రరావు గురువారం సంతాపం తెలిపారు. దామోదర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అత్తిలి మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు దాసం ప్రసాద్, అత్తిలి జనసేన పార్టీ టౌన్ అధ్యక్షుడు ప్రభు, అత్తిలి మండలం జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడపిల్లల్ని చదివించాలి



వీరవాసరం, ఫిబ్రవరి 8: ఆడపిల్లలను చదివించడం మన ధర్మం అని, వారిని ప్రోత్సహించి విద్యావంతులను చేయాలని ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారిణి బి.సుజాతరాణి అన్నారు. భేటీబచావో, భేటీపడావో కార్యక్రమంలో భాగంగా గురువారం వీరవాసరం, మత్స్యపురి, దూసనపూడి గ్రామాలలో పలు అంగనవాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. తల్లుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిషోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించారు. గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్ విషయాలపై అవగాహన కలిగించారు. సీడీపీవో టి.లక్ష్మీకాంతం, సూపర్‌వైజర్ పి.కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఉండి, ఫిబ్రవరి 8: నులిపురుగుల నివారణ మాత్రలను విద్యార్థులంతా విధిగా వేసుకోవాలని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో నులిపురుగుల వాల్ పోస్టర్లును విడుదల చేశారు. అనంతరం శ్రీహరినారాయణరాజు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులందరికి అందించి వారు వేసుకునే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర, పీహెచ్‌సీ వైద్యుడు డాసాయిచంద్ర తదితరులు పాల్గొన్నారు.